సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం | 12 | నవంబర్ | 2024



కార్తీక దీపోత్సవంలో కొండా సురేఖ

వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో రాష్ట్ర దేవాదాయధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి కార్తీకదీపాలు వెలిగించారు. పలువురు మహిళా భక్తులకు పసుపు, కుంకుమలు జాకెట్ ముక్కలను వాయినంగా ఇచ్చారు.

– హన్మకొండ కల్చరల్

న్యూస్‌రీల్

'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి

విద్యారణ్యపురి : పదో తరగతి విద్యార్థులు (రెగ్యులర్, ప్రైవేట్, వన్స్ ఫెయిల్డ్) ఈనెల 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2వ తేదీవరకు, రూ.200ల అపరాధ రుసుముతో డిసెంబర్ 12వరకు, రూ.500ల అపరాధ రుసుముతో డిసెంబర్ 21వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఆమె వెల్లడించారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.గౌట్.ఇన్‌లో చూడవచ్చనని పేర్కొన్నారు.

102 పైలట్ నియామకాలకు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్: 102 వాహనాల్లో పైలట్ (డ్రైవర్) ఉద్యోగ నియామకాలకు ఈనెల 13న హనుమకొండ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 22 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండాలని పేర్కొన్నారు. 10వ తరగతి పాసై హెవీ ట్రాన్స్‌పోర్ట్ బ్యాడ్జ్ నంబర్ కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 13వ తేదీన నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. ఉద్యోగ నియామకాల తర్వాత రాష్ట్రంలోని ఏ జిల్లాలోనైనా ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

16న విదేశీ ఉద్యోగాలకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్


హన్మకొండ అర్బన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా జిల్లాలో నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్, యువ వర్కర్ల ఉద్యోగాల భర్తీకి ఈనెల 16న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండి, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, జీఎన్ఎం, నర్సింగ్ వంటి అర్హతలతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎల్కతుర్తిలోని రైతు వేదికలో హాజరై ఎన్‌రోల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 99487 62077, 79979 73323 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మంత్రికి ఆహ్వానం



హన్మకొండ కల్చరల్: ఈ నెల 15న కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని రుద్రేశ్వరాలయంలో నిర్వహించనున్న లక్షదీపోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. ఈమేరకు సోమవారం వరంగల్ ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేఖను కలిసి ఉపేంద్రశర్మ ఆహ్వాన పత్రికను అందజేశారు.

న్యాస్‌పై ప్రత్యేక శ్రద్ధ అవసరం



విద్యారణ్యపురి: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అందుకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని హనుమకొండ డీఈఓ వాసంతి హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలతో, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లతో భీమారంలోని స్కిల్ స్టార్క్ పాఠశాలలో విద్యాశాఖలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. డిసెంబర్ 4న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్, ఎ.శ్రీనివాస్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మహేశ్, డీసీఈబీ కార్యదర్శి డాక్టర్ బి.రాంధన్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస్‌స్వామి, పీజీ హెచ్‌ఎం బి.రాధ మాట్లాడారు. జిల్లాలోని హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

కేయూ దూర విద్య పీజీ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో 9 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు కొనసాగుతున్నాయి. కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ క్యాంపస్‌లోని పరీక్ష కేంద్రాన్ని, వరంగల్ ఎల్‌బీ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రయాణం.. ప్రయాస!

ప్రమాదకరంగా పెద్దమ్మగడ్డ బైపాస్ రోడ్

- గుంతలమయంగా రహదారి, పనిచేయని సిగ్నళ్లు
- కనిపించని సూచిక బోర్డులు
- భారీ వాహనాలతో భయం భయం



పెద్దమ్మగడ్డ జంక్షన్‌లో అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు



యాదవనగర్ మూలమలుపు వద్ద కానరాని ప్రమాద హెచ్చరిక బోర్డులు



రెడ్డికాలనీలోని వికాస్ స్కూల్ సమీపంలో గుంతలు పడిన రహదారి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పెద్దమ్మగడ్డ నుంచి కాకతీయ యూనివర్సిటీకి వెళ్లే జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. ఎక్కడ గుంతలున్నాయో అర్థం కాని పరిస్థితుల్లో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు భయపడుతూ ప్రయాణిస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా భారీ వాహనాలు రద్దీగా ఉండే జాతీయ రహదారికి ఇరువైపులా నివాసముంటున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రహదారి వెంట సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తి పనులు..

సుమారు పదేళ్ల క్రితం కేయూ జంక్షన్ నుంచి పెద్దమ్మగడ్డ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పటికీ నేటికీ అక్కడక్కడా అసంపూర్తి పనులే దర్శనమిస్తున్నాయి. మూడు కిలోమీటర్ల మేర ఉన్న బైపాస్ రోడ్‌లో రోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారింది. జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి

సిగ్నళ్లు పనిచేయక..

ములుగు నుంచి హనుమకొండకు వచ్చే దారిలో పెద్దమ్మగడ్డ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లు కొద్దిరోజులుగా పని చేయడం లేదు. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. మూడు దారుల నుంచి బస్సులు, లారీలతో రద్దీగా ఉండే ప్రదేశంలో సిగ్నళ్లు పనిచేయక వాహనదారులు, రోడ్డు దాటాలంటే జంకుతున్నారు. జంక్షన్‌లో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు సర్వసాధారణంగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఇరుకు రోడ్డు.. ఇబ్బందికర రాకపోకలు

పదేళ్ల క్రితమే పెద్దమ్మగడ్డ బైపాస్‌రోడ్డు విస్తరణ జరిగినప్పటికీ రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోతున్న పెద్దమ్మగడ్డ ప్రజలకు ప్రత్యామ్నాయం చూపడంలో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ పూర్తిగా విఫలమైందనే ఆరోపణలున్నాయి. దీంతో విస్తరణకు పెద్దమ్మగడ్డ ప్రజలు విముఖత చూపెట్టారు. దీంతో పెద్దమ్మగడ్డ జంక్షన్ నుంచి కేయూకు వెళ్లే దారిలో సుమారు 300ల మీటర్ల మేర రోడ్డు చాలా ఇరుగ్గా ఉంటుంది. ఇక్కడ భారీ వాహనాలు వెళ్లే సమయంలో స్థానికులు ఇతర వాహనదారులు భయంభయంగా గడుపుతున్నారు. ఐదేళ్ల క్రితం పెద్దమ్మగడ్డలో తెల్లవారుజామును ఓ ఇంట్లోకి భారీ లారీ దొచ్చుకు వెళ్లింది. ఇంట్లో నిద్రిస్తున్న వారిలో ఒకరు చనిపోగా.. కుటుంబసభ్యులు గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వాహనాలకు అనుమతి ఇవ్వొద్దు..



రాత్రి వేళల్లో ఇసుక లారీలు, పగలు కాంక్రీట్ వాహనాల రాకపోకలతో రోడ్డు దాటాలంటే భయం వేస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డు ఉన్నప్పటికీ అధికారులు బైపాస్‌రోడ్డులో భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వడం బాధాకరం. భారీ వాహనాల కారణంగానే రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలి. పోలీసులు భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వకుండా చర్యలు చేపట్టాలి.

– హన్మకొండ బద్రి, పెద్దమ్మగడ్డ

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



పెద్దమ్మగడ్డ నుంచి కేయూ వరకు రోడ్డంతా గుంతలమయమే. భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్తుండడంతో రోడ్డు అధ్వానంగా మారింది. దీనికి తోడు మూలమలుపు, కల్వర్టు, జంక్షన్ల వద్ద కనీస ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వర్షాకాలంతో పాటు రాత్రి వేళల్లో ఈ రహదారి వెంట భయంభయంగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

– గాదె రమేశ్, జ్యోతిబసు కాలనీ

కమిషనర్ గారూ.. కనికరించరూ..

- ఎన్నిసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోవట్లేదు
- కమిషనర్‌కు మొర పెట్టుకున్న గ్రేటర్‌వాసులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ

వరంగల్ అర్బన్: క్షేత్ర స్థాయిలో సమస్యలతో సహవాసం చేస్తున్నామని, కనికరం చూపాలని పలు కాలనీలకు చెందిన ప్రజలు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా పలు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని, ఇబ్బందులకు పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం కమిషనర్ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల పనితీరుపై సమీక్షించారు. ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీపీఎస్‌ల పనితీరు మెరుగుపడాలని హెచ్చరించారు. శానిటేషన్ పరిస్థితులు మెరుగయ్యేలా చూడాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌సెల్‌కు మొత్తం 67 ఫిర్యాదులు రాగా.. అందులో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు, అనుమతులు లేని కట్టడాలపై అత్యధికంగా ఉన్నాయి. ఇంజనీరింగ్‌కు 7, హెల్త్–శానిటేషన్‌కు 7, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 9, టౌన్ ప్లానింగ్‌కు 35, మంచినీటి సరఫరా 9 నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఎంహెచ్ఓ రాజేశ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- భీమారం కాకతీయ నగర్‌లో డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్డుపై పారుతోందని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.
- 41వ డివిజన్ విశ్వనాథ కాలనీలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయని కాలనీ వేల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరారు.
- 17వ డివిజన్ స్తంభంపల్లి, జానీపీరీలలో మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీరు సరఫరా జరగడం లేదని ఆయా కాలనీలవాసులకు విన్నవించారు.
- 10వ డివిజన్ శ్రీ రాంనగర్, పద్మాక్షమ్మ కాలనీలో 30 ఫీట్ల రోడ్డు కొంత మేర ఉందని, మరికొంత 20 ఫీట్లు ఉందని, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్‌కు సమీపంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొంత మేర నిర్మించారని వినతి పత్రం సమర్పించారు.
- హనుమకొండ బాలసముద్రం ఎదురుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రావుల కోమల కిషన్ ఫిర్యాదు చేశారు.
- ఎన్‌జీఓస్ కాలనీ రోడ్డులోని ఇందిర నగర్‌లో కల్వర్టు లేక రోడ్డంతా జలమయమవుతోందని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు విన్నవించారు.
- బాలసముద్రంలోని శ్మశాన వాటికకు రెండో గేట్ లేనందున అసాంఘిక కార్యకాలపాలకు అడ్డాగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అర్జీలు పరిష్కరించి నమ్మకం పెంచండి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్స్ సంఘం నాయకులు

కాశీబుగ్గ సెంటర్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించి ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంచాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారద, జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో 95 దరఖాస్తులు రాగా.. సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. 45 దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో రెవెన్యూ శాఖకు చెందినవి కాగా.. 10 కలెక్టరేట్‌కు సంబంధించినవి, 6 జిల్లా ఉపాధి శాఖ, మిగతా 34 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి ఉన్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్ఓ మాడమూషి విజయలక్ష్మి, ఆర్డీఓ ఉమారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


- ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న చైర్మన్, పక్కన కలెక్టర్ ఇతర అధికారులు

హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారం కోసం అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, 15 రోజుల్లో పరిష్కరించి నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో భూ, అట్రాసిటి సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, ఇతర శాఖల అధికారులతో కమిషన్ బృందం సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో నమోదైన అట్రాసిటి కేసులు, వాటి పురోగతి వివరాలను డీసీపీలు రవీందర్, సలీమా, ఏసీపీలు తిరుమల్, దేవేందర్ రెడ్డి, తిరుపతి, కిశోర్ కుమార్.. కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. భూ వివాదాలకు సంబంధించిన కేసులు, అట్రాసిటి కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో జరుగుతుందని హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎంతమంది బాధితులకు పరిహారం అందిందనే వివరాలను జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీలత వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పరిహారం విడుదలలో ప్రభుత్వ జాప్యంపై తాను మాట్లాడతానన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో మాట్లాడుతూ హసన్‌పర్తి మండలం మునిపల్లిలో దళితుల భూసమస్యకు సంబంధించి వారం రోజుల్లో నివేదికను కమిషన్‌కు అందజేయాలని, జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మొత్తం 21 కేసులపై సంబంధిత తహసీల్దార్ల నుంచి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజుల్లో సమగ్ర నివేదికను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. అంతకు ముందు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు కలెక్టర్ ప్రావీణ్య మొక్క అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేశ్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నునావత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్‌కుమార్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, రడపాక పరంజ్యోతి జవహర్‌లాల్ నాయక్, రాజేందర్, సింగారపు రవిప్రసాద్, ఈవీ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమాధానం చెప్పకుండా ఎదురుదాడి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్, పక్కన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి

హన్మకొండ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ఎదురుదాడికి దిగుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ముందుగా దాస్యం మాట్లాడుతూ కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్ అమలుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడిగితే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేస్తానని అహంకారంతో మాట్లాడుతున్నాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబితే..సీఎం రేవంత్ బుల్డోజర్ ఎక్కిస్తానని, ఏవేవో శాపనార్థాలు పెట్టాడని..ఇదేనా మీ సంస్కృతి అని ప్రశ్నించారు. గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..పత్తి ధరలు తగ్గి రైతులు ఇబ్బందులు పడుతుంటే ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలున్నా ఇప్పటివరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఒక్క కిలో పత్తి కొనిపించారా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు పులి రజనీకాంత్, బొంగు అశోక్ యాదవ్, కుసుమ లక్ష్మీనారాయణ, నయీముద్దీన్, కృష్ణ, జానకి రాములు పాల్గొన్నారు.

వేగం పుంజుకోని కొనుగోళ్లు

- ఉమ్మడి జిల్లాలో 1,128 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- వాటిలో ప్రారంభించినవి 672
- ఇప్పటివరకు సేకరించిన ధాన్యం 2.32 లక్షల మెట్రిక్ టన్నులే..

సాక్షిప్రతినిధి, వరంగల్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఈసారి అరిగోస పడుతున్నారు. ఓ వైపు పత్తి రైతులను 'తేమ' గండం వెంటాడుతుంటే.. మరోవైపు వరి సాగు చేసిన రైతులకు కొనుగోలు కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం భారీగా తరలివస్తుండగా.. జేఎస్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ వరికోతలు ఊపందుకున్నాయి. సీజన్ ఆరంభంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) శాతం (ఔట్ టర్న్)ను 67 నుంచి 58 శాతానికి తగ్గిస్తేనే ధాన్యం దించుకుంటామని రైస్ మిల్లర్లు అభ్యంతరాలు చెప్పారు. ఆయా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు రైస్‌మిల్లర్ల సంక్షేమ సంఘాలతో చర్చలు జరిపినా చాలాచోట్ల మిల్లర్లు ఇంకా ముందుకు రావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

- వరి సాగు విస్తీర్ణం (అంచనా): 8.10 లక్షల ఎకరాలు
- సాగైన విస్తీర్ణం: 9,02,233
- ధాన్యం కొనుగోలు లక్ష్యం: 12.25 లక్షల మె.టన్నులు
- ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలు: 1,128
- ఇప్పటి వరకు ప్రారంభించినవి: 672
- కొనుగోలు చేసిన ధాన్యం: 2.32 లక్షల మె.టన్నులు

ఆ మెలిక అలాగే..

ఉమ్మడి జిల్లాలో సాగైన 9,02,233 ఎకరాలకుగాను ఈసారి రైతులు సుమారు లక్ష ఎకరాల్లో మాత్రమే దొడ్డు రకాలు వేయగా.. 90 శాతం వరకు సన్నరకాలే వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో వాతావరణ ప్రభావం కారణంగా క్వింటాకు 67 శాతం బియ్యం సీఎంఆర్ ఇవ్వలేమని మొదటి నుంచి చెబుతున్న రైస్ మిల్లర్ల పేచీ ఇంకా అలాగే సాగుతోంది. దీనికి తోడు ఈసారి మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం కస్టోడియన్, మిల్లింగ్, రవాణా చార్జీలు పెంచాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. తాజాగా సోమవారం కూడా పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌కు వరంగల్ రైస్‌మిల్లర్ల సంక్షేమ సంఘం లేఖ రాసింది. మిల్లుల్లో ధాన్యం దిగుమతి చేసుకుంటున్నా.. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని రా రైస్, పారాబాయిల్డ్ రైస్‌మిల్లుల సంక్షేమ సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీలు కోరాయి. ఇప్పటికే పలు దఫాలు వానాకాలం ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ తరలింపులపై రైస్‌మిల్లర్ల సంఘాలతో ఆయా జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో పాటు పౌరసరఫరాల సంస్థ అధికారులు సంప్రదింపులు జరిపారు. తాజా డిమాండ్లను కమిషనర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్న హామీతో మిల్లర్లు ధాన్యాన్ని దింపుకుంటున్నారు.

సమగ్ర సర్వేపై కమిషనర్ అసంతృప్తి



ఎల్లంబజార్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ అర్బన్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమై మూడు రోజులైనా ఆశించిన పురోగతి లేదని, ప్రతీ రోజు నగర వ్యాప్తంగా 20 వేల కుటుంబాల వివరాలు సేకరించి, నమోదు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్‌కు చెందిన డిప్యూటీ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులతో సర్వేపై సమీక్షించారు. మూడు రోజులుగా కాజీపేట సర్కిల్ పరిధిలో 11,535 కాగా, కాశిబుగ్గ సర్కిల్‌లో 13వేలకు పైగా కుటుంబాల వివరాలు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సర్కిల్‌వారీగా రోజుకు 10 వేల కుటుంబాల చొప్పున వివరాలు సేకరించాలని సూచించారు.

సర్వేపై సందేహాలు వద్దు: వరంగల్ కలెక్టర్

సర్వేపై పౌరులకు సందేహాలు అవసరం లేదని, వివరాలు గోప్యంగా ఉంటాయని కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం సాయంత్రం 24వ డివిజన్‌లోని పాటక్ మొహల్లా, ఎల్లంబజార్‌లో కొనసాగుతున్న సర్వే తీరునును ఆమె పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఓ సిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

కాశిబుగ్గ: ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఓ సిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం చూపించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ పరమావధి అన్నారు. ప్రజల కోసం తూర్పులో హైదరాబాద్‌లో ప్రతీ నిత్యం అందుబాటులో ఉంటానని, ఎవరైనా ఎప్పుడైనా తనని కలవొచ్చని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖను 19వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి రాజేశ్ కలిసి ఓ సిటీలోని శ్రీసీతారామాంజనేయ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం చేయనున్నట్లు అందుకు ప్రభుత్వం నుంచి ఏర్పాట్లు చేయాలని కోరారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో వరంగల్ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం సభ్యులు మంత్రిని కలిసి మార్కెట్ సమస్యలు తెలిపారు. అనంతరం వారు మంత్రి సురేఖను సన్మానించారు. జిల్లా తాపీ మేస్త్రీల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో పలువురు నాయకులు, అధికారులు, ప్రజలు ఉన్నారు.

అబుల్ కలాం ఆజాద్ కృషి మరువలేనిది

హన్మకొండ అర్బన్: దేశంలో విద్యారంగాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి మరువలేనిదని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం కలాం జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఐఐటీ, సీఎస్ఐఆర్ సంస్థలు అన్ని ఆయన కృషి ఫలితమేనన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ వైవీ గణేశ్, డీఎండబ్ల్యూఓ మురళీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


టోర్నమెంట్‌కు ఎంపికైన మహిళా జట్టుతో వెంకయ్య

ఇంటర్ వర్సిటీ తైక్వాండో టోర్నమెంట్‌కు కేయూ జట్టు

కేయూ క్యాంపస్: అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 15వ తేదీవరకు జరగనున్న ఆల్ ఇండియా జోన్ ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య సోమవారం తెలిపారు. జి. శిరీష, ఎస్. తేజస్విని (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె. శ్రీవాణి (వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్, వరంగల్), బి. రుద్ర (ఏకశిల డిగ్రీకాలేజీ, జనగామ), పి. నాగలక్ష్మి (ప్రభుత్వ డిగ్రీకాలేజీ ,చెన్నూరు), సీహెచ్. తులసి (నలంద డిగ్రీ కాలేజీ, మహబూబాబాద్) ఉన్నారు.ఈ జట్టుకు కోచ్ అండ్ మేనేజర్‌గా మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. రమేశ్ వ్యవహరించనున్నారని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య తెలిపారు.



ప్రపంచ పారా తైక్వాండో పోటీలకు గౌతమ్

వరంగల్ స్పోర్ట్స్ : బహ్రెయిన్‌లోని మైన్మాలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ సీనియర్ పారా తైక్వాండో పోటీలకు హనుమకొండలోని పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్, జనరల్ సెక్రటరీ గణేశ్ యాదవ్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గౌతమ్‌యాదవ్ బంగారు పతకం సాధించారు. బీ-50 , పూంసే విభాగంలో గోల్డ్ సాధించిన గౌతమ్ ప్రపంచస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. భారత తైక్వాండో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ వీణాకుమారి, హరియాణ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్ చేతుల మీదుగా గౌతమ్‌యాదవ్ బంగారు పతకం అందుకున్నారు.


బంగారు పతకం అందుకుంటున్న గౌతమ్‌యాదవ్

క్లుప్తంగా

రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని రుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక రుద్రాభిషేకాలు జరుపుకున్నారు. రాత్రి 8 గంటలకు మహా హారతి శోభాయమానంగా జరిగింది. భక్తులు నాగేంద్రస్వామి వద్ద జ్యోతులు వెలిగించారు.

అక్షర చిట్స్ ఎదుట బాధితుల ఆందోళన



కాజీపేట అర్బన్ : అక్షర చిట్స్ ఖమ్మం బ్రాంచ్ బాధితులు సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని అక్షర చిట్స్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లాలోని ఆరు బ్రాంచ్‌ల్లో సుమారు రూ.2కోట్ల వరకు చెల్లింపులు చేయకపోవడం.. వాయిదాల మీద వాయిదాలు పెట్టడంతో విసిగివేసారిన వందమందికిపైగా బాధితులు నక్కలగుట్టలోని అక్షర కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఘటనస్థలానికి చేరుకున్నారు. డబ్బులు చెల్లింపు యాజమాన్యంతో మాట్లాడుకుని తేల్చుకునే అంశమని ఆందోళనకారులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. కాగా, నాలుగు గంటలపాటు ఆందోళన కొనసాగగా.. అక్షర యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

మధ్యాహ్నంనుంచి కొనుగోళ్లు

దిగొచ్చిన అధికారులు.. చర్చలు సఫలం

- అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు సై
- సీసీఐ ఆంక్షలతో తొలుత బంద్..
- చర్చల విజయవంతంతో మధ్యాహ్నం నుంచి ప్రారంభం..


సమాచారం లేక సీసీఐ కేంద్రానికి వచ్చిన లూజు పత్తి వాహనాలు

వరంగల్: పత్తి కొనుగోళ్లు షురూ అయ్యాయి. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఎల్-1, ఎల్-2, ఎల్-3 పద్ధతి అమలు చేస్తామంటూ విధించిన ఆంక్షలను నిరసిస్తూ రాష్ట్ర కాటన్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ పరిధిలోని మిల్లుల్లో సోమవారం ఉదయం పత్తి కొనుగోళ్లు నిలిచాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రంగంలోకి దిగి సీసీఐ ఉన్నతాధికారులు, కాటన్ అసోసియేషన్ నాయకులతో చర్చలు జరపగా సఫలమయ్యాయి. గతేడాది సీసీఐ జిన్నింగ్ మిల్లులకు బేల్ ఒక్కటికి రూ.1,345 చెల్లించింది. ఈ ఏడాది నిర్వహించిన టెండర్లలో జిన్నర్స్ రూ.1,495 కోట్ చేశారు. ధరలపై చర్చలు జరిపిన సీసీఐ అధికారులు గతేడాది ఎంత చెల్లించామో అంతే చెల్లిస్తామని చెప్పి చివరకు రూ.5 పెంచేందుకు ఒప్పుకోవడంతో మిల్లుల యజమానులు అంగీకరించారు. ఇప్పుడు కొన్ని ఎల్-1, ఎల్-2 పేరుతో కొన్ని కేంద్రాలను నడిపించడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతారనే చర్చ జరిగినట్లు తెలిసింది. చివరకు మార్కెట్‌ల పరిధిలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో రైతులు తమ ఇష్టం వచ్చిన మిల్లులో పత్తి అమ్ముకునేలా ప్రభుత్వ అధికారులు, సీసీఐ అధికారుల మధ్య అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఈ కేంద్రాల్లో సీసీఐ అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఆలస్యంగా కొనుగోళ్లు..



రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు వరంగల్ మార్కెట్ పరిధిలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. రెండు, మూడు రోజులుగా సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తామని వ్యాపారులు ప్రచారం చేయడంతో మార్కెట్‌కు రైతులు పెద్దగా సరుకు తీసుకురాలేదు. దీనివల్ల మార్కెట్‌లో రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు జరగలేదు. కాగా, పత్తి కొనుగోళ్లు జరగడం లేదనే సమాచారం తెలియని కొందరు రైతులు మార్కెట్‌కు వచ్చారు. దీంతో కార్యదర్శి నిర్మల.. పత్తి కొనుగోళ్లు మధ్యాహ్నం వరకు ప్రారంభమవుతాయని హామీ ఇవ్వడంతో ఎలాంటి ఆందోళనలు జరగలేదు. చివరకు సీసీఐ, ప్రభుత్వం, కాటన్ అసోసియేషన్ల మధ్య చర్చలు సఫలం కావడంతో మధ్యాహ్నం ఒంటిగంటకు జెండా పాట పెట్టారు. ఈజెండా పాటలో క్వింటాల్ గరిష్ట ధర రూ.6,960 నిర్ణయం జరిగింది. అనంతరం జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోళ్లు జరగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

దిగుబడి తగ్గింది..



రెండు ఎకరాల్లో పత్తి వేశా. పెట్టుబడి రూ.40వేల వరకు అయ్యింది. అందులో రూ.30వేలు కూలీల ఖర్చు అయ్యింది. మొత్తం పత్తిని తీసుకొచ్చా. రెండు ఎకరాల్లో కేవలం 6.60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీసీఐకి అమ్మగా ధర క్వింటాల్‌కు రూ.6750 పడింది. పత్తి మొత్తం తీసివేశా. మొక్కజొన్న వేస్తా.

- డి.బాలు, చెన్నారావుపేట మండలం

7,192 క్వింటాళ్ల పత్తి కొనుగోలు



కొనుగోళ్లు ఆలస్యమైనప్పటికీ ప్రైవేట్, సీసీఐ రైతుల నుంచి 7,192క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. వ్యాపారులు 2,524బస్తాల పత్తి(1,262 క్వింటాళ్లు), 24లూజ్ వెహికిల్స్‌లో 380 క్వింటాళ్లు.. మొత్తం 1,642 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. సీసీఐ పత్తి 184 వాహనాల్లో కొనుగోలు కేంద్రాలకు రాగా 5,550 క్వింటాళ్లు కొనుగోలు చేసింది.

- పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి, ఏనుమాముల

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టి వారి సమస్యలు పరిష్కరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని గ్రేయిన్ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు తెలుసుకుని మార్కెటింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన ప్యాడీ క్లీనింగ్ మిషన్లు లేవన్నారు. దీంతో రైతులు గంటకు రూ. వెయ్యి చెల్లించి ప్రైవేట్ ప్యాడీ క్లీనర్‌ను అద్దెకు తీసుకుని వడ్లను తూర్పార పడుతున్నారన్నారు. దీని వల్ల రైతులపై భారం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్యాడీ క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. దొడ్డు, సన్న వడ్లు తీసుకుని వచ్చిన రైతుల పంట లోడ్ అయ్యే వరకు చూడకుండా వచ్చిన ధాన్యం వచ్చినట్లే తరలించాలన్నారు. హమాలీ చార్జీలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వం మిల్లర్లతో మాట్లాడిందని, సోమవారం నుంచి సీసీఐ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, సౌడ రమేశ్, ఊడుగుల రమేశ్, కౌన్సిలర్ మహంకాళీ హరిశ్చంద్ర గుప్తా, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ..

- మద్యం బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడులు
- పలువురికి గాయాలు

హసన్‌పర్తి: కుటుంబ కలహాలు ఇరువర్గాల మధ్య గొడవ ఘర్షణకు దారి తీశాయి. కత్తులు, ఇనుప రాడ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈఘటనలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఇరు వర్గాలు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన శాలినికి ఇదే ప్రాంతానికి చెందిన బిల్లా రణధీర్‌తో 19 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సావ్యంగానే సాగింది. వీరికి కుమారుడు, కూతురులు ఉన్నారు. అయితే కొంతకాలంగా డబ్బుల కోసం రణధీర్ తన భార్యను వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. భర్త వేధింపులకు భరించలేక శాలిని సోమవారం ఉదయం తల్లిగారింటికి వచ్చింది. అత్తారింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో రణధీర్ వెళ్లి శాలినిని ఇనుప రాడ్లతో కొట్టాడు. ఘర్షణను అడ్డుకోవడానికి యత్నించిన బావమరిది రాకేశ్, మామ శివాజీపై దాడికి పాల్పడ్డాడు. ఈక్రమంలో ఇరువర్గాల మద్యం బాటిళ్లు, ఇనుప రాడ్లతో దాడులకు దిగారు. ఈఘర్షణలో ఇరువర్గాలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'బ్యాక్‌లాగ్' ఎందుకు భర్తీ చేయడం లేదు?

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు ఎన్ని ఉన్నాయి? ఉంటే ఎందుకు భర్తీ చేయడం లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రశ్నించారు. ఈ అంశంపై రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.. సభ్యులు రామ్‌బాబునాయక్, రేనుకుంట్ల ప్రవీణ్ తదితరులతో కలిసి కాకతీయ యూనివర్సిటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ విషయంపై తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా కాలేజి ప్రిన్సిపాల్ మధుశ్రీ మాట్లాడుతూ కాలేజిలో విద్యార్థినులకు హాస్టల్ వసతిలేదని, కల్పించాల్సిన అవసరం ఉందని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వీసీ ప్రతాప్‌రెడ్డి.. ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి, వివిధ యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు భిక్షాలు, సుదర్శన్, వరలక్ష్మి, అమరవేణి, సీడీసీ డీన్ రాంచంద్రం, అకడమిక్ ఆడిట్ డీన్ హనుమంతు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ సమస్యలు తెలియజేయాలని కోరారు. దీంతో పలువురు విద్యార్థినులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సంఖ్య పెంచి ఎస్‌డీఎల్‌సీని బలోపేతం చేయాలని డైరెక్టర్ రాంచంద్రానికి సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ.. అనంతలోకాలకు

- బైక్ అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడి మృతి


రాజిరెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హసన్‌పర్తి : అంత్యక్రియలకు హాజరై తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఓ బైక్ అదుపు తప్పగా ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన హసన్‌పర్తి మండలంలోని ముచ్చర్ల సమీపం ఈదులచెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం సీతానాగారానికి చెందిన రేషన్ డీలర్ సూదుల మోహన్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ అంత్యక్రియలకు కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన మూల రాజిరెడ్డి (50) హాజరయ్యాడు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత ద్విచక్రవాహనంపై సీతానాగారం నుంచి కడిపికొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో ముచ్చర్ల సమీపంలో ఈదుల చెరువు వద్ద బైక్ అదుపు తప్పగా రాజిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

మహిళా సాధికారత పెరగాలి

- ప్రముఖ న్యాయవాది జహాఆరా


స్మారకోపన్యాసం చేస్తున్న ప్రముఖ న్యాయవాది జహాఆరా

కేయూ క్యాంపస్: పోరాటాలతోనే మహిళలకు ఎన్నో నూతన చట్టాలు వచ్చాయని, అయితే పురుషాధిక్య సమాజంలో ఆ చట్టాలు సరిగా అమలుకు నోచుకోవడం లేదని విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది జహాఆరా అన్నారు. దివంగత మానవహక్కుల నేత కె.బాలగోపాల్ 14వ స్మారకపోన్యాసం సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనేట్‌హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 'స్త్రీల హక్కులు ..రోల్ ఆఫ్ జ్యూడిషీయరీ' అనే అంశంపై జహాఆరా స్మారకోపన్యాసం చేశారు. హక్కుల కోసం పోరాడిన బాలగోపాల్ అందరివాడన్నారు. నేటి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళల సాధికారత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా చట్టాలు దుర్వినియోగమవుతున్నాని, ఇంకా పురుషాధిక్యత కొనసాగుతోందన్నారు. లింగవివక్ష పోతేనే మహిళలకు రక్షణ అన్నారు. ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ డాక్టర్ బాలగోపాల్ సామాజిక మార్పు కోసం వివిధ దృక్కోణాలతో పరిశీలించేవారన్నారు. అసమానత, అణచివేత, ప్రశ్నించేతత్వం ఒక ప్రగతిశీల ప్రజాస్వామ్య ఆలోచన అన్నారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, న్యాక్ పూర్వపు డైరెక్టర్ వీఎస్ ప్రసాద్, బాలగోపాల్ సతీమణి వసంతలక్ష్మి, పర్‌స్పెక్టివ్ సంస్థ సభ్యులు, విశ్రాంత ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రిని సందర్శిస్తున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్


హన్మకొండ చౌరస్తా : కే షీట్లను పరిశీలిస్తున్న ఆర్‌వీ కర్ణన్

ప్రసవాల సంఖ్య పెంచాలి

- ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- వరంగల్ సీకేఎం ఆస్పత్రి తనిఖీ
- శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణపై అసంతృప్తి
- పాలనపై సమీక్ష నిర్వహించాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు


ఎంజీఎం: ప్రాంగణంలో మురుగునీరు

ఎంజీఎం : వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిని సందర్శించి వైద్యసేవలతో పాటు, నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ ఆస్పత్రిలో అడుగుపెడుతూనే అధ్వానంగా ఉన్న శానిటేషన్ వ్యవస్థను గమనించారు. ఆస్పత్రిలో లేబర్, రూమ్, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌తో సమస్యలపై చర్చించారు. 10 మంది వైద్యులు ఉన్నచోట నెలకు వెయ్యి వరకు ప్రసవాలు అవుతున్న క్రమంలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీలతో కలిపి మొత్తం 30 మంది వైద్యులు ఉన్న చోట ప్రసవాల సంఖ్య తక్కువ కావడానికి గల కారణాలేమిటని ప్రశ్నించారు. పేద ప్రజలు ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందేలా సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలో సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావును ఆదేశించారు.

శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి

ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణపై కమిషనర్ కర్ణన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది వైఫల్యంలో సాంకేతిక కారణాలు ఉన్నాయని ఆర్ఎంఓలు కమిషనర్‌కు వివరించారు. ఇలాంటి సమస్యలు పునరావృత్తం కాకుండా ప్రణాళికాప్రకారం ముందుకు సాగి సమస్య పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పూర్తిస్థాయిలో ఉన్న అతడికి శాఖాపరమైన మెమోలు ఇచ్చేందుకు పరిపాలనాధికారులు ఎందుకు జంకుతున్నారో అర్థం కావడం లేదు.

ఆస్పత్రిలో ఎక్కడ చూసినా ఎలుకలే..

సీకేఎంలో పారిశుద్ధ్యం పూర్తి స్థాయిలో లోపించింది. దీంతో ఆస్పత్రిలో ఎక్కడ చూసినా ఎలుకలే సంచరిస్తూ ప్రాంగణమంతా పూర్తిగా అధ్వానంగా మారింది. ఆస్పత్రికి వస్తే వైద్యసేవలు పొందడం దేవుడెరుగు.. లేని రోగులు వస్తాయమో అన్న చందంగా తయారైంది పరిస్థితి. ఆస్పత్రి పాలనపై జిల్లా మంత్రి కొండా సురేఖతో పాటు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సేవలు మెరుగుపరచాలని పలువురు రోగులు వేడుకుంటున్నారు.

జీఎంహెచ్‌ను తనిఖీ చేసిన ఆర్‌వీ కర్ణన్

హన్మకొండ చౌరస్తా: ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఇంకా ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన వైద్య సేవలందించాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో స్కానింగ్ సెంటర్ ను తనిఖీ చేసిన ఆయన రోజుకు ఎన్ని టిఫా స్కానింగ్, గైనిక్ స్కానింగ్‌లు చేస్తున్నారో రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆ వివరాలను టీహబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కేషీట్‌లను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పీఓడీటీటీ లలితాదేవి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ఆర్ఎంఓ అంబరీశ్, పీఓఎంసీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనగామకు మరో గౌరవం..

- మలేషియా వేదికపై కూచిపూడి నృత్యం
- చిన్నారుల అద్భుత ప్రదర్శన




మలేషియా వేదికపై జనగామ చిన్నారులు, మాస్టర్ సుఖేశ్

జనగామ: జనగామకు దక్కిన మరో గౌరవం దక్కింది. మలేషియా గడ్డపై పేరిణి నృత్యంతో నలుగురు చిన్నారులు జనగామ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం నృత్య మాస్టర్ పులిగిల్ల సుఖేశ్ ఆధ్వర్యంలో చిన్నారి కళాకారులు బి.వర్షిత, ఎస్.హరిప్రియ, బి.మనస్విక, బి.దీతిక.. మలేషియాలోని కౌలాలంపూర్ వేదికపై ఆదివారం రాత్రి కూచిపూడిలో అద్భుత ప్రదర్శన నిర్వహించారు. పాలకుర్తి కోదండరామశర్మ, తెలుగు మలేషియా అసోసియేషన్, పిరమిడ్ యోగా అండ్ డ్యాన్స్ అకాడమీ యూకే అసోసియేషన్ నిర్వహించిన దివాళీ కల్చరల్ ఫెస్టివల్ సంబురాల్లో పాల్గొని తెలుగువారి సంప్రదాయ కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మామునూరు చెరువు కట్ట వద్ద ఘటన
- రాయపర్తి మండలం జింకురాం తండాలో విషాదం


సురేశ్ (ఫైల్)

మామునూరు: డ్యూటీకి వెళ్లి వస్తానని భార్యకు చెప్పి బయలుదేరిన గంట వ్యవధిలోనే ఓ వ్యక్తిని మృత్యువు కబళించింది. జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఎదురుగా వచ్చే వాహన లైటింగ్ ఫోకస్ కళ్లలో పడడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాదకర దుర్ఘటన ఆదివారం అర్ధరాత్రి మామునూరు చెరువుకట్ట వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జింకురాం తండాకు చెందిన బాధవత్ నర్సింహ, భారతి దంపతుల కుమారుడు సురేశ్ (26)కు నాలుగేళ్ల క్రితం ఉషతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె, 14 రోజుల బాబు ఉన్నారు. సురేశ్ హనుమకొండలో ఓ వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాలింత అయిన భార్య ఉష, మూడేళ్ల కుమార్తెను చూసేందుకు శనివారం రాత్రి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఇద్దరు పిల్లలతో సంతోషంగా గడిపాడు. డ్యూటీకి వెళ్లి వస్తా బాబు జాగ్రత్త అంటూ భార్య ఉషకు చెప్పి రాత్రి 12 గంటలసమయంలో బైక్‌పై రాయపర్తి నుంచి హనుమకొండకు బయలుదేరాడు. మామునూరు శివారు చెరువు కట్ట వద్దకు చేరుకోగానే వరంగల్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాల లైటింగ్ ఫోకస్ కళ్లలో పడడంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జాగ్రత్తలు చెప్పి బయలుదేరిన గంట వ్యవధిలోనే ఇలా జరిగిందంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న మామునూరు ఎస్సై కృష్ణవేణి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాధవత్ నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ సోమవారం తెలిపారు.

నెల్లుట్లలో మహిళ..


రాములమ్మ(ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై నెల్లుట్ల -యశ్వంతాపూర్ మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివరాత్రి రాములమ్మ(53) మృతి చెందింది. ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. నెల్లుట్లకు చెందిన రాములమ్మ వ్యవసాయ బావి వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా కారు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని, కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.